
కాలువ అడుగున కుంగిన లైనింగ్.. నీళ్లలో స్పష్టంగా కనిపిస్తున్న దృశ్యం

ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే ఏటా కాలువలు, డిస్ట్రిబ్యూటరీ మరమ్మతులు పూర్తి చేస్తారు. జలాశయాల్లో వరద చేరగానే పంట కాల్వలకు సాగు నీటి విడుదలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇంజనీర్లు జాగ్రత్తలు తీసుకోవాలి. ఏటా జరిగే ప్రక్రియ ఇది. ఇందుకు విరుద్ధంగా తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు (టీబీపీ) పరిధిలో కాలువలకు నీరు విడుదల చేసే ముందు టెండర్లు పిలుస్తారు. కానీ అందుకు భిన్నంగా నీటిని వదిలాక హడావుడిగా పనులు మరమ్మతులు చేపట్టి నాణ్యతా ప్రమాణాలు తుంగలో కలిపేస్తున్నారు. ఇప్పటికే చేసిన పనులకు సుమారు రూ.350 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గతేడాది టెండర్లు పిలిచిన మరో రూ.300 కోట్ల పనులకు అగ్రిమెంట్ కూడా చేయలేదు. తాజాగా ఎల్లెల్సీ, హెచ్చెల్సీ కాలువల పరిధిలో మరమ్మతుల పేరిట దాదాపు రూ.27.97 కోట్లతో టెండర్లు పిలవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కాల్వకు నీరు వచ్చే ముందు మరమ్మతుల మాయ చేసి నిధులు స్వాహా చేయడంలో భాగమేనన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.


హొళగుంద సమీపంలో గత ఏడాది చేసిన ఎల్లెల్సీ సీసీ లైనింగ్ పనులు

ఎందుకంత హడావుడి..?

- నీటి విడుదల ముందు టెండర్లు..!
- 'తుంగ'లో నాణ్యత ప్రమాణాలు
- తాజాగా ఎల్లెల్సీ, హెచ్చెల్సీ మరమ్మతులకు రూ.27.97 కోట్లతో టెండర్లు
- ఇప్పటికే రూ.350 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్
- తుంగభద్ర ప్రాజెక్టులో ఇదో మాయ

కర్నూలు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) పరిధిలో ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్, రబీలో 1,51,413 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి. ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు పట్టణాలు సహా 139 గ్రామాలకు తాగునీరు అందించాల్సి ఉంది. తుంగభద్ర జలాశయం నుంచి ఎల్లెల్సీ కాలువకు కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ-1) అవార్డులో భాగంగా 24 టీఎంసీల నీటి వాటా కేటాయించారు. 0/0 కి.మీల నుంచి 241 కి.మీల వరకు ప్రధాన కాలువ తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు పర్యవేక్షణలో ఉంది. అలాగే అనంతపురం జిల్లాలో హెచ్చెల్సీ నీటి వాటాగా 35.5 టీఎంసీలు. నీటి వాటా రాబట్టడంతో పాటు కాలువల నిర్వహణకు ఏపీ ప్రభుత్వం ఏటా రూ.40 కోట్లు నిధులు కేటాయిస్తుంది. 70 ఏళ్ల క్రితం నిర్మించిన ఎల్లెల్సీ కాలువ గట్లు బలహీనంగా మారాయి. పూడిక, ముళ్ల కంపలు పెరిగిన నీటి ప్రవాహ సామర్థ్యం తగ్గింది. ఏటా పూర్తిస్థాయిలో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రెండేళ్లలో టీబీపీ బోర్డు ఇంజనీరింగ్ అధికారులు రూ.919.80 కోట్లతో ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. అయితే గత జగన్ ప్రభుత్వం నిధులు కేటాయించకుండానే బోర్డు ఇంజనీర్లు, గత వైసీపీ ప్రభుత్వం పెద్దలు టెండర్లు పిలిచి పనులు చేపట్టడం సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. వాటాల కోసమే సీసీ లైనింగ్ పనులు చేపట్టారనే ఆరోపణలు లేకపోలేదు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. తుంగభద్ర జలాశయానికి వరద మొదలైంది. ఇప్పుడు మరమ్మతు పనుల పేరిట టెండర్లు పిలవడం ఏమిటి..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



బిల్లులు చెల్లించకుండానే తిరిగి టెండర్లు

రాష్ట్ర ప్రభుత్వం అనుమతితో 2022-23లో రూ.519.80 కోట్లతో టెండర్లు పిలిచారు. అందులో రూ.448 కోట్లతో 115.275 కి.మీల నుంచి 205.45 కిమీల వరకు ఆర్‌సీసీ లైనింగ్ పనులకు 9 ప్యాకేజీలుగా విభజించి ఈ-ప్రొక్యూర్మెంట్ టెండర్లు పిలిచారు. ఈ టెండర్ల వ్యవహారంలో గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి వైసీపీ కీలకమైన ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున వాటాలు అందాయనే ఆరోపణలు ఉన్నాయి. అప్పుడు చేసిన పనులకు దాదాపు రూ.135-150 కోట్లకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉందని ఓ కాంట్రాక్టరు తెలిపారు. గత ఏడాది మరో రూ.233 కోట్లతో పనులు చేపట్టి దాదాపు రూ.200 కోట్ల విలువైన పనులు చేశారు. అంటే రెండేళ్లలో చేసిన పనులకు సుమారు రూ.350 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. ఈ బిల్లులు చెల్లించకుండానే టీబీపీ బోర్డు ఉన్నతాధికారులు ఎల్లెల్సీలో రూ.300 కోట్లు, హెచ్చెల్సీ పరిధిలో రూ.100 కోట్లు కలిపి రూ.400 కోట్లకు టెండర్లు పిలిచారు. బిల్లులు రాకపోవడంతో కొత్త పనులకు అగ్రిమెంట్ చేసుకోలేమంటూ కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఏడాది అగ్రిమెంట్ దశలోనే ఆగిపోయాయి. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోయినా 0.5-1 శాతం అగ్రిమెంట్ పర్సెంటేజీకి ఆశపడి విచ్చలవిడిగా టెండర్లు పిలుస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. వాస్తవ పరిస్థితులు ఇలా ఉంటే నీళ్లొచ్చే ముందు మరమ్మతుల పేరిట మరో రూ.15-20 కోట్లకు టెండర్లు పిలవడం విమర్శలకు తావిస్తోంది. సమగ్ర విచారణ చేస్తే భారీ కుంభకోణం వెలుగు చూసే అవకాశం ఉంది. ఈ విషయంపై బళ్లారి జిల్లా హోస్పెట్‌లో ఉన్న టీబీపీ బోర్డు ఎస్ఈ శ్రీకాంత్ రెడ్డి వివరణ కోసం ఆంధ్రజ్యోతి ఫోన్లో ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

నిధుల స్వాహా కోసమేనా..?

తుంగభద్ర డ్యాంలో 2024-25 నీటి సంవత్సరంలో 172 టీఎంసీలు వరద చేరే అవకాశం ఉందని ఈ నెల 6న టీబీపీ బోర్డు ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన టీబీపీ బోర్డు వాటర్ రివ్యూ కమిటీ అంచనా వేసింది. ఎల్లెల్సీ కోటాగా 19.472 టీఎంసీలు, కేసీ వాటాగా 8.113 టీఎంసీలు కలిపి జిల్లా వాటాగా 27.585 టీఎంసీలు కేటాయించారు. అదే క్రమంలో జూలై 15న ఎల్లెల్సీ కాలువకు సాగునీరు విడుదల చేయాలని తీర్మానం చేశారు. అంటే తుంగభద్ర డ్యాం ఎగువన వర్షాలు కురిసి వరద చేరితే నెల రోజుల్లో కాలువకు నీళ్లొచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం డ్యాంలో 1,619 క్యూసెక్కులు వరద చేరుతుంది. 6.105 టీఎంసీలు నీటి నిల్వ ఉంది. భారీ వర్షం ఒక్కటొస్తే కాలువకు నీటి విడుదల చేసే స్థాయిలో వరద చేరుతుంది. ఇలాంటి సమయంలో ఎల్మెల్సీ హెచ్చెల్సీ మరమ్మతుల పేరిట టీబీపీ బోర్డు ఎస్ఈ పరిధిలో రూ.23.88 కోట్లతో 35 పనులు, టీబీపీ ఎల్లెల్సీ బళ్లారి డివిజన్ ఈఈ పరిధిలో రూ.1.70 కోట్లతో 21 పనులు, టీబీపీ హెచ్చెల్సీ టీబీ డ్యాం డివిజన్ ఈఈ పరిధిలో 21 పనులు 2.39 కోట్లతో టెండర్లు పిలిచారు. మొత్తం రూ.27.97 కోట్లతో 77 పనులకు టెండర్లు పిలిచారు. ఎస్ఈ పర్యవేక్షణలో టెండర్లు షెడ్యూల్ గడువు 15వ తేదీన ముగిసింది. ఈఈల పర్యవేక్షణలోని టెండర్లు షెడ్యూల్ ఆఖరి గడువు ఈనెల 21, 24 వరకు ఉంది. ఈ ప్రక్రియ పూర్తి చేసి కాంట్రాక్టరుతో అగ్రిమెంట్ చేసుకుని పనులు మొదలు పెట్టాలంటే పది రోజులకు పైగా అవుతుంది. డ్యాంలో వరద చేరి జూలై 15న కాలువకు నీళ్ల వదిలితే మరమ్మతులు ఎలా చేస్తారు..? ఇప్పటికే రూ.919 కోట్లతో ఆధునికీకరణ పనులు మొదలు పెట్టారు. దాదాపు రూ.550-600 కోట్ల పనులు పూర్తి చేశారు. ఆధునికీకరణ పనులు జరుగుతుండగా మరమ్మతులు ఎలా చేస్తారు..? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.





టమోటా అ'ధర'హో..!

గోనెగండ్లలో కిలో రూ.120 ● సామాన్యుడు విలవిల



గోనెగండ్ల , జూన్ 17: ప్రతి వంటలోనూ తప్పనిసరిగా ఉండాల్సిన టమోటా కొండెక్కి కూర్చుంది. పది రోజులుగా టమోటా ధరల్లో భారీగా వ్యత్యాసం వచ్చింది గోనెగండ్ల మండల కేంద్రంలో కిలో టమోటా రూ.120 పలుకుతోంది. దీంతో బక్రీద్ పండుగ రోజు సామాన్యులు టమోటాను కొనే పరిస్థితి లేకుండా పోయింది. పంట దిగుబడి లేకపోవడం కారణంగా ధర పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ఎమ్మిగనూరు కూరగాయాల మార్కెట్‌లో 25 కిలోల బాక్స్ ధర రూ.2,500 నుంచి రూ.3వేల వరకు పలుకుతోంది. టమోటా సైజు, నాణ్యతను బట్టి ధర పలుకుతుంది. మొత్తం మీద టమోటా రైతుకు లాభాలు వస్తున్నా.. సామాన్యుడు మాత్రం ధరను చూసి బెంబేలెత్తిపోతున్నాడు.

ప్రపంచ శాంతి కోసం శ్రీమఠంలో హోమం


ధన్వంతరీ హోమాన్ని ప్రారంభిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, జూన్ 17: ప్రపంచంలోని ప్రజలు, దేశంలోని రైతులు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ శ్రీమఠంలో ధన్వంతరీ హోమాన్ని చేపడుతున్నట్లు పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు తెలిపారు. సోమవారం శ్రీమఠం యాగశాలలో రిటైర్డ్ ప్రిన్సిపల్ వాధిరాజాచార్ ఆధ్వర్యంలో ధన్వంతరీ హోమాన్ని ప్రారంభించారు. పండితులు కనకాచలాచార్, వెంకటేశాచార్, కృష్ణాచార్‌లు వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య హోమాన్ని నిర్వహించారు. ముందుగా హోమానికి పీఠాధిపతి పూర్ణాహుతి, హారతులు ఇచ్చారు. ఈ హోమం వల్ల ప్రపంచ శాంతి, ఖరీఫ్ సాగులో సకాలంలో వర్షాలు కురిసి రైతులు పాడి పంటలతో సుఖశాంతులతో వర్ధిల్లుతారని పీఠాధిపతి పేర్కొన్నారు.

ఘనంగా బక్రీద్

త్యాగనిరతిని చాటుదాం

ముస్లిం మతపెద్దల పిలుపు ● మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు


పాత ఈద్గాలో ప్రసంగిస్తున్న ప్రభుత్వ ఖాజీ సయ్యద్ సలీం బాషా, ప్రార్థనల్లో ముస్లింలు


కొత్తబస్టాండు వద్ద పాత ఈద్గా ఎదుట రహదారిపై ముస్లింల ప్రార్థనలు



కర్నూలు (కల్చరల్), జూన్ 17: బక్రీద్ వేడుకలోని త్యాగశీలతను, త్యాగనిరతిని భావితరాలకు చాటి చెప్పాలని, సేవాగుణం, పరస్పర సహకార భావాలను పంచుకోవడమే బక్రీద్ ఉద్దేశమని ముస్లిం మతపెద్దలు పిలుపునిచ్చారు. సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ముస్లింలు బక్రీద్ (ఈద్-ఉల్-అదా)ను ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని ఈద్గాలు, మసీదుల వద్ద మత పెద్దలు నమాజ్‌లు చేయించి, దైవ సందేశాన్ని అందించారు. బక్రీద్ వేడుక దైవం కోసం చేసిన త్యాగగుణాన్ని తెలియజేస్తుందని, అయితే ఈ త్యాగగుణ జీవనాన్ని చిత్తశుద్ధిగా పాటించినప్పుడే దానికి సార్థకత చేకూరుతుందని చెప్పారు. త్యాగమయమైన జీవితం అత్యుత్తమ విలువలతో కూడుకున్నదని, ఇది ప్రతి ఒక్కరూ అంతర్గతంగా, బాహ్యంగానూ పాటించాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఇస్లాం ప్రబోధిస్తుందన్నారు. నేటి యువతకు పండుగల్లోని పరమార్థాన్ని తెలియజేస్తూ, భావితరాలకు అనుసరణీయంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ ప్రార్థనలు చేశారు. ఈద్ నమాజ్‌ల అనంతరం ముస్లింలు పరస్పరం ఆలింగనం చేసుకొని 'ఈద్ ముబారక్' తెలియజేసుకున్నారు.

కర్నూలు నగరంలో...

కర్నూలు నగరంలో నాలుగు ఈద్గాలు, సుమారు 150 మసీదుల్లో ఈద్ ప్రార్థనలు నిర్వహించారు. కొత్త బస్టాండు సమీపంలోని పాత ఈద్గాలో ప్రభుత్వ ఖ్వాజీ సయ్యద్ సలీం బాషా, సంతోష్‌నగర్‌లోని కొత్త ఈద్గాలో ముఫ్తీ మన్సూర్ ఖ్వాస్మి, గడ్డ వీధిలో రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ హఫీజ్ మంజూర్ అహ్మద్, జోహరాపురం ఈద్గాలో హఫీజ్ రియాజ్‌లు మతపెద్దలుగా వ్యవహరిస్తూ ప్రార్థనలు నిర్వహించారు. కర్నూలు మాజీ ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, ఎస్వీ మోహన్‌రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ బాషా సంతోష్‌నగర్ ఈద్గాలో ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.


కల్లూరుకు వెళ్లే రోడ్డు.. పాత ఈద్గా ఎదుట ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

కుర్చీ వదలరు...!

● వైసీపీతో అంటకాగిన ఉద్యోగుల్లో ఆందోళన ● ప్రజాప్రతినిధుల ఇళ్ల చుట్టూ చక్కర్లు ● అసెంబ్లీ సమావేశాల అనంతరం బదిలీలు ● రెవెన్యూ శాఖలో ప్రక్షాళన దిశగా ప్రభుత్వం



కర్నూలు(కలెక్టరేట్), జూన్ 17: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల అనంతరం టీడీపీ ప్రభుత్వం ఏర్పడటంతో జిల్లా అధికారులతో పాటు డివిజన్, మండల స్థాయి అధికారుల బదిలీలపై ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో దీర్ఘకాలం కొనసాగుతున్న వారిని, వైసీపీ ఏజెంట్లుగా వ్యవహరించిన కొందరు అధికారులను బదిలీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. జిల్లాలో కొందరు అధికారులు మూడు నుంచి ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది వైసీపీ ప్రభుత్వంలో ఆయా ప్రజాప్రతినిధులకు అనుకూలంగా వ్యవహరించారు. మరికొందరు పైరవీలు చేసి కీలక స్థానాలు పొందారు. ఎన్నికల సమయంలోనూ వైసీపీకి అనుకూలంగా విధులు నిర్వహించాలని ఆరోపణలు ఎదుర్కొన్నారు. ప్రతి పనికి ఒక ధర నిర్ణయించి తమ వ్యక్తిగత సిబ్బంది ద్వారా వసూళ్ల పర్వానికి దిగారనే విమర్శలు సైతం ఉన్నాయి. వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో సన్నిహిత సంబంధాలు నిర్వహించి కమీషన్లు పంచుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. అలాంటి అధికారులు ఇప్పుడు తమ స్థానాలు కోల్పోకుండా ఉండేందుకు ప్రజాప్రతినిధుల ఇళ్లు చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. తాజాగా ఎన్నికల్లో నెగ్గిన ఎమ్మెల్యేల చుట్టూ తిరగడమే పనిగా పెట్టుకున్నారు. మరో వారం రోజుల్లో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతాయి. సమావేశాల అనంతరం అన్ని శాఖల్లోనూ బదిలీలు ఉంటాయన్నది స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో తమను ఎక్కడికి బదిలీ చేస్తారోనని అధికారులు భయపడుతున్నారు.

రెవెన్యూ శాఖ కీలకం

అన్ని శాఖల్లోని ప్రధానమైన శాఖ రెవెన్యూ శాఖ కీలకం. గ్రామ, పట్టణాల్లో, వార్డు, గ్రామ వీఆర్వోలు, ఆర్ఐలు డిప్యూటీ తహసీల్దార్లు, తహసీల్దార్లు, ఆర్డీవోలు ప్రధాన పాత్ర పోషించనున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు వల్ల రైతులు చాలా ఇబ్బందులకు గురయ్యారు. వైసీపీ ప్రభుత్వ అధికార ఏజెంట్లు రైతులపై ఉక్కుపాదం మోపారు. వైసీపీ ప్రభుత్వం జగనన్న శాశ్వత భూహక్కులో రైతులు ఆస్తులకు సంబంధించి అన్ని తప్పులతడకగా రెవెన్యూ అధికారులు నమోదు చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో రెవెన్యూశాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్న ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ ఏజెంట్లుగా గుర్తింపు పొందిన అధికారులను తొలగించి పూర్తి స్థాయిలో రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేసే దిశగా అధికార తెలుగుదేశం ప్రభుత్వం ఉంది. ఈ క్రమంలో రెవెన్యూ ఉద్యోగుల్లోనూ కలవరం మొదలైంది.



'చంద్రబాబు నాయుడు అంటే విజన్ ఉన్న నేత. ఉమ్మడి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించిన ఘనకీర్తి కూడా ఉంది. రాష్ట్ర విభజన అనంతరం కూడా ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి మొదలుపెట్టారు. ఆయన కృషితోనే జిల్లాలో విమానాశ్రయం, పరిశ్రమలు వంటివి వచ్చాయి. ఏదైనా రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రోడ్లు, పెట్టుబడులు, మౌలిక వసతుల కల్పనతోనే సాధ్యం. నాపై నమ్మకంతో సీఎం చంద్రబాబు నాయుడు ఆ మూడు శాఖలను నాకు కట్టబెట్టారు. ఆ శాఖల నిర్వహణకు ఓ రూట్ మ్యాప్ తయారు చేసుకుంటాను. మౌలిక వసతుల కల్పనతో రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేలా ప్రణాళికతో పని చేస్తాం. ప్రస్తుతం ఉన్న రోడ్ల స్వరూపాన్ని పూర్తిగా మార్చి ప్రజల ఇబ్బందులు తీరుస్తాం. ఏం ఆశించి ప్రజలు టీడీపీకి పట్టం కట్టారో.. వారి ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తూ రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలుపుతాం' అంటూ రోడ్లు, భవనాల శాఖ, పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో తెలిపారు.

నంద్యాల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి):


ఆంధ్రజ్యోతి పత్రికను చదువుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నిబద్ధతతో పని చేస్తా

- రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా
- ఇచ్చిన శాఖలకు న్యాయం చేస్తా
- ఓ రూట్ మ్యాప్ ప్రకారం పెట్టుబడులను తెస్తా
- ముగ్గురు మంత్రులం సమన్వయంతో సాగుతాం
- ఉమ్మడి జిల్లాను పురోగతి వైపు తీసుకువెళతాం
- ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి: సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి ఏంటి?


బీసీ: గాలేరు-నగరి, కుందూ నది విస్తరణ వంటి పనుల వల్ల జిల్లాకు ఒరిగింది ఏమీ లేదు. కేవలం కమీషన్ల కోసం చేపట్టిన ప్రాజెక్టులే అవి. గాలేరు-నగరి లైనింగ్ పనుల్లో పూర్తి నాసిరకం పనులు చేపట్టారు. ఇక కాలువ అడుగు భాగానికి కూడా లైనింగ్ చేయడంతో ఇక్కడి భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇక రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌కి రూ.3800 వేల కోట్లు ఖర్చు పెడుతున్నా, దాని వల్ల తోడుకునే నీరు తక్కువే. దానికంటే తక్కువ ఖర్చు పెడితే గుండ్రేవుల ప్రాజెక్టు ద్వారా 20 టీఎంసీలు నీటిని వాడుకోవచ్చు. ఈ విషయాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులకు తగు నాయ్యం జరిగేలా చూడటమే కాకుండా, కమీషన్ల కోసం జరిగిన అవినీతిని బయటపెడతాం.

ఆంధ్రజ్యోతి: కీలకమైన పదవి దక్కడం వెనకాల మీరు పడిన శ్రమ గురించి చెబుతారా ?

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి: పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచాను. పార్టీ ఏ కార్యక్రమాలు చేపట్టమని సూచించినా వెనుకాడకుండా చేశాను. నా నిబద్ధత ఏమిటో పార్టీ పెద్దలకు అర్థమైంది. ఇవన్నీ చూసి శాఖలను సమర్థవంతంగా నిర్వహించగలనన్న నమ్మకం సీఎం చంద్రబాబు నాయుడికి కలిగింది. సాన్నిహిత్యం వల్లే నాకు మంత్రి పదవి వచ్చిందని ఎవరికైనా అనిపిస్తే నా కష్టాన్ని, నా సమర్థతను తక్కువ అంచనా వేసినట్లే.

ఆంధ్రజ్యోతి: కీలక శాఖలు అప్పగించడం పట్ల మీ అభిప్రాయం?

బీసీ : ఈ మూడు ముఖ్యమైన శాఖలే. వైసీపీ ప్రభుత్వంలో ఈ శాఖల మంత్రుల తీరు వల్ల జరిగిన అభివృద్ధి ఏమిటి? అసలు ఈ శాఖలకు గత ప్రభుత్వం ఏమేర నిధులు కేటాయించింది అన్నది ఎవరికీ తెలియదు. దీంతో ఈ శాఖలను గాడిలో పెట్టాలంటే పదేళ్లలో చేయాల్సిన శ్రమను ఐదేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది. అప్పుడు గానీ మేము చేసిన మేలు ప్రజలకు కనిపించదు. కాబట్టి ముఖ్యమైన శాఖలు వచ్చినందుకు ఆనందంగా ఉన్నా లోపల కాస్త ఆందోళనగానే ఉంది. అలా అని వెనుకడుగు వేసే ప్రసక్తే లేదు. నాకు ఇచ్చిన పనులను చిత్తశుద్ధితో నిర్వహిస్తాను.



ఆంధ్రజ్యోతి: రోడ్లను ఎలా తీర్చిదిద్దబోతున్నారు?

బీసీ : మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత సంబంధిత అధికారులను కలిసి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేసేందుకు సిద్ధంగా ఉండండి అని చెప్పాను. 'సార్.. రోడ్లకు ప్యాచ్‌లు వేయాలని చెబుతున్నారు. జిల్లాలో రోడ్లు ఉంటే కదా ప్యాచ్‌లు వేసేది!' అని అధికారులు సమాధానమిచ్చారు. దీనికి కారణాలను అన్వేషిస్తే.. జగన్ జమానాలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా వేధించారు. కొంతమంది కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకున్న పరిస్థితిని కూడా చూశాం. దీనివల్ల మిగతా కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రాలేదు. టెండర్లు వేయకపోతే బ్లాక్ లిస్టులో పెడతామని వైసీపీ ప్రభుత్వం హెచ్చరించినా కాంట్రాక్టర్లు పనులకు ముందుకు రాలేదు. ఇక తెలంగాణ మంత్రులు ఏపీ రోడ్ల గురించి తక్కువ చేసిన మాట్లాడిన సందర్భాలు కూడా చూశాం. దీనిని బట్టి వైసీపీ ప్రభుత్వ పాలన ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు. ముందు ఈ పరిస్థితిని మారుస్తాం. చేసిన పనులకు వెంటనే బిల్లులు చెల్లిస్తామని కాంట్రాక్టర్లకు భరోసా ఇస్తాం. రోడ్లను అద్దాల్లా మారుస్తాం. ప్రజల ఇబ్బందులను దూరం చేస్తాం.



ఆంధ్రజ్యోతి: ముగ్గురు మంత్రులు జిల్లాను ఏ విధంగా అభివృద్ధి పథంలోకి తీసుకువెళతారు?

బీసీ : వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులు తమ సంపదను ఎలా పెంచుకోవాలి? రాష్ట్రాన్ని ఏ విధంగా అప్పుల పాలు చేయాలి? అని ఆలోచించారు తప్పించి జిల్లాను అభివృద్ధి చేసిందేమీ లేదు. ముఖ్యంగా కొత్తగా ఏర్పడిన నంద్యాల జిల్లాను అయితే పూర్తిగా విస్మరించారు. కానీ టీడీపీ ప్రభుత్వం అలా చేయబోదు. ముగ్గురు మంత్రులం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతాం. యువకుడైన టీజీ భరత్‌కు పరిశ్రమల శాఖ, నాకు పెట్టుబడుల, మౌలిక సదుపాయల శాఖ ఇవ్వడం వల్ల ఇద్దరం కలిసి నిర్ణయాలు తీసుకుంటే పెట్టుబడులు, పరిశ్రమలు జిల్లాకు భారీగా తరలి రావడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఇవన్నీ సక్రమంగా నిర్వహిస్తూ అభివృద్ధి పథంలో దూసుకువెళ్లేలా చూస్తాం.

ఆంధ్రజ్యోతి: పెట్టుబడులను ఆకర్షించడం కోసం ఏమైనా ప్రణాళికలు ఉన్నాయా..?

బీసీ : గత ప్రభుత్వం పెట్టుబడుల సదస్సు పెయిడ్ ఆర్టిస్టులను తీసుకువచ్చింది. ఆ సదస్సులో ఎంవోయూలు చేసుకున్నవన్నీ డొల్ల కంపెనీలు. రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టేందుకు సదస్సు పేరిట ఆడిన పెద్ద డ్రామా. జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మి నిజంగా పెట్టుబడులు పెట్టే కంపెనీలు ఏపీ రాలేదన్నది వాస్తవం. ఎవరైనా ధైర్యం చేసి వస్తే కమీషన్ల కక్కుర్తితో వాటిని తరిమేసింది. కొన్ని కంపెనీలు ఇక్కడి పరిస్థితులను చూసి భయపడి తెలంగాణ, చెన్నై, కర్ణాటక వంటి రాష్ట్రాలకు పారిపోయిన ఘటనలు కూడా ఉన్నాయి. కానీ మా సీఎం చంద్రబాబు నాయుడికి ఉన్న క్రెడిబులిటీ వేరు. గతంలో సీఎంగా ఉన్న సమయంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు చాలా కంపెనీలు క్యూ కట్టాయి. ప్రస్తుతం పెట్టుబడులను ఆకర్షించేందుకు ఒక్కో జిల్లాను ఒక నమూనాగా తీసుకుని అనుకూలమైన పరిస్థితులు కల్పిస్తాం. స్థానిక పరిస్థితులకు అనుకూలమైన పరిశ్రమలు స్థాపించేలా చర్యలు తీసుకుంటాం. రాష్ట్రాన్ని పెట్టుబడుల స్వర్గధామంగా మార్చుతాం.

పాపం.. పసిపాప

- నీటి కుంటలో పడి ఏడేళ్ల చిన్నారి మృతి
- బెంగళూరు వలస వెళ్లిన తల్లిదండ్రులు


మృతి చెందిన బాలిక వైష్ణవి

మంత్రాలయం, జూన్ 17: ఆడుతూ.. పాడుతూ తిరిగే ఏడేళ్ల చిన్నారి వైష్ణవి (7) నీటి కుంటలో పడి మృతి చెందింది. ఈ సంఘటన మంత్రాలయం మండలం బూదూరు గ్రామంలో జరిగింది. చాకలి వెంకప్ప, సుజాత దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు లావణ్య, రెండో కూతురు వైష్ణవి (7). సొంతూరులో పనులు దొరక్క పోవడంతో పిల్లల పెద్దనాన్న పెద్దమ్మ లక్ష్మీకాంత్, మహాలక్ష్మిలకు అప్పజెప్పి తల్లిదండ్రులు ఇద్దరూ బెంగుళూరు వలస వెళ్లారు. సోమవారం లావణ్య, వైష్ణవి పెద్దమ్మ మహాలక్ష్మి వెంట వాగు దగ్గరలోని కుంటలో బట్టలు ఉతికేందుకు వెళ్లి అక్కడి నుంచి పొలానికి వెళ్లారు. వైష్ణవి నీటి కుంట దగ్గరకు వెళ్లి స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడిపోయింది. రైతులు, గ్రామస్థులు హుటాహుటిన బాలికను నీటి కుంటను బయటకు తీసేలోపు అప్పటికే ప్రాణాలు కోల్పోయింది. స్థానిక బాలికల పాఠశాలలో 3వ తరగతి చదువుతోంది. ఈ వార్తను తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే బెంగళూరు నుంచి వచ్చి చిన్నారిని చూసి రోదించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్ తెలిపారు.

నేడు పీఎం కిసాన్ డబ్బులు జమ

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 17: పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజనకు సంబంధించి 17వ విడత డబ్బులను మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వారణాసిలో విడుదల చేయనున్నారు ఈ పథకం కింద కర్నూలు, నంద్యాల జిల్లాలో దాదాపు మూడు లక్షల మంది రైతులు లబ్ధి పొందనున్నారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని 2019 ఫిబ్రవరి నుంచి అమలు చేస్తోంది. సంవత్సరానికి రూ.6వేల చొప్పున ఇప్పటికీ 16 విడతలుగా ఒక్కో విడతకు రూ.2వేల చొప్పున రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారు. ఏటా ఏప్రిల్, జూలై నెలల్లో తొలి విడతగా, అదే విధంగా ఆగస్టు, నవంబరులో రెండో విడతగా, డిసెంబరు మార్చి మూడో విడతగా రూ.2వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సాయం అందజేస్తున్నది. ఇప్పటి వరకు ఇట్లా 16సార్లు రైతుల ఖాతాల్లో నిధులను జమ చేస్తూ వచ్చింది. పీఎం కిసాన్ బెనిఫిషియరీ స్టేటస్, ఇన్‌స్టాల్మెంట్ స్టేటస్ Http-s://-p-m-k-i-san.-go-v.in పోర్టల్‌ను ఓపెన్ చేసి తెలుసుకోవచ్చు.

రైలు కింద పడి విద్యార్థి ఆత్మహత్య

ఆదోని, జూన్ 17: ఆదోని మండలం పెసలబండ గ్రామానికి చెందిన గొల్ల వెంకటేశ్వర్లు, పద్మ దంపతుల ఏకైక కుమారుడు ఈశ్వర్ (20) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి జరిగింది. పెసలబండ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, పద్మ దంపతులు ఆదోని పట్టణంలోని శిల్పా సౌభాగ్యనగర్‌లో నివాసముంటున్నారు. వెంకటేశ్వర్లు హెల్త్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు. వీరి ఏకైక కుమారుడు ఈశ్వర్ తిరుపతిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. అయితే జల్సాలకు అలవాటు పడిన ఈశ్వర్ ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడుతూ డబ్బు నీళ్లలా ఖర్చు చేసేవాడు. ఇది మంచి పద్ధతి కాదని తండ్రి వెంకటేశ్వర్లు కుమారుడికి నచ్చ చెప్పాడు. దీన్ని జీర్ణించుకోలేని ఈశ్వర్ ఆదివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో నగరూరు-ఆదోని రైల్వే స్టేషన్ల మధ్య కి.మీ 492/12-10 వద్ద వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఈ విషయం తెలిసిన ఎస్ఐ గోపాల్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ఈశ్వర్ శరీర భాగాలను ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాల్ విలేకరులకు తెలిపారు.

23న ఒలంపిక్ డే రన్



మాట్లాడుతున్న ఒలంపిక్ అసోసియేషన్ సంఘం నాయకులు

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 17: ఒలంపిక్ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా ఈ నెల 23వ తేదీన కర్నూలు నగరంలో ఒలంపిక్ డే రన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ చైర్మన్ డా. షేక్ మహబూబ్‌బాషా, సంఘం అధ్యక్షుడు వి. రామాంజనేయులు తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఒలంపిక్ డే సెలబ్రేషన్స్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 18న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో అంతర్ పాఠశాల బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 19న అంతర్ పాఠశాలల ఫుట్‌బాల్ పోటీలు, 20న తైక్వాండో, అదే రోజు స్థానిక గణేష్‌నగర్‌లో ఉన్న స్కేటింగ్ రింగులో స్కేటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23న కలెక్టరేట్ దగ్గర నుంచి కొండారెడ్డి బురుజు వరకు ఒలంపిక్ రన్ ఉంటుందన్నారు. సెలబ్రేషన్స్‌లో విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు, క్రీడాకారులు శ్రేయోభిలాషులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బాధితులను ఆదుకుంటాం

- ఎంపీ బస్తిపాటి నాగరాజు


మృతదేహాల వద్ద ఎంపీ బస్తిపాటి నాగరాజు

తుగ్గలి, జూన్ 17: ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన కామేశ్వరమ్మ, సుంకన్న కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని.. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. సోమవారం మండల పరిధిలోని రామలింగాయపల్లెలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన వ్యక్తుల భౌతికకాయాలకు పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎక్స్‌గ్రేషియా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పిడుగుపాటుకు ఈ ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో పాటు దాదాపు 90 గొర్రెలు కూడా మృతి చెందాయి. అలాగే పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఫోన్‌లో బాధిత కుటుంబాలను పరామర్శించారు. జొన్నగిరి ఎస్ఐ గ్రామానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం చేయించి కేసు నమోదు చేశారు. వీరి వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి, మాజీ ఎంపీపీ కొమ్మె వెంకటేశ్ ఉన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు నగదు చెల్లింపు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 17: నగర శివారులోని టిడ్కో లబ్ధిదారులు ఇంటి కోసం చెల్లించిన నగదును ప్రభుత్వం తిరిగి వారి అకౌంట్లో వేసినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవతేజ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఇటీవల ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన పేర్కొన్నారు. గతంలో టిడ్కో ఇంటి కోసం లబ్ధిదారులు నగదు చెల్లించారు. అయితే అనివార్య కారణాల వల్ల తమకు ఇళ్లు వద్దని..తమ నగదు వెనక్కి ఇవ్వాలని గత నాలుగు సంవత్సరాలుగా కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు. ఈ మేరకు సుమారు 500 మందికి పైగా నగదు తిరిగి చెల్లించాలని ప్రభుత్వానికి నగర పాలక సంస్థ అధికారులు నివేదికలు పంపారు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక 84 మంది లబ్ధిదారులకు రూ.54,37,500 విడుదల చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మిగిలిన లబ్ధిదారులకు కూడ త్వరలోనే నగదును చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అర్హత లేనివారు, తమ అవసరం ఉందని కొందరు నగదు వెనక్కి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఔషధశాల కౌంటర్ ప్రారంభం

- కాన్పుల వార్డుల దగ్గర ఏర్పాటు
- దూరం ఉందంటున్న రోగులు


కొత్తగా ఏర్పాటు చేసిన ఔషధ కౌంటర్

కర్నూలు(హాస్పిటల్), జూన్ 17: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఔషధశాల మందులిచ్చే కౌంటర్ (13)ను సోమవారం కాన్పుల వార్డు దగ్గర ప్రారంభించారు. నాలుగు కౌంటర్లలో ఫీమేల్‌కు 2, మేల్‌కు రెండు కేటాయించారు. క్యాజువాల్టీ పక్కన ఉన్న ఫార్మసీ కౌంటరు వద్ద మందులు తీసుకునేందుకు రోగులు క్యూలైన్లలో బారులుతీరి ఉంటారు. ఈ సమస్యను అధిగమించేందుకు కాన్పుల వార్డు సమీపంలో ఉన్న రోగుల సహాయకుల విశ్రాంతి భవనంలోకి మర్చారు. అయితే ఔషధశాలను మార్చడంపట్ల కొందరు రోగులు సంతోషం వ్యక్తం చేస్తుండగా.. మరికొందరు దూరంగా ఉందని అంటున్నారు. కాన్పుల కోసం వచ్చిన గర్భిణుల సహాయకులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న రోగుల విశ్రాంతి భవనంలో ఔషధశాలను మార్చడం వల్ల ఇబ్బందిగా ఉందని అంటున్నారు. ఔషధశాల ముందు మురుగునీరు, డ్రైనేజీ నీరు నిల్వ ఉండటం వల్ల దుర్వాసన వస్తున్నది. డ్రైనేజీ సమస్యలను పరిష్కరించి ఔషధ శాల వద్ద సౌకర్యాలు కల్పించాలని రోగులు కోరుతున్నారు. కోతుల బెడదను కూడా నివారించాలని అంటున్నారు.

దూరంగా ఉంది

కొత్తగా కాన్పుల వార్డు దగ్గర ఏర్పాటు చేసిన మందుల కౌంటరు దూరంగా ఉంది. కాళ్ల నొప్పులు ఉన్న నేను ఇంత దూరం వచ్చి మందులు తీసుకోవడం కష్టంగా ఉంది.

- కర్రెన్న రోగి, రేమట, కర్నూలు మండలం





దగ్గరలో ఉండాలి

మందుల కౌంటరు దగ్గరగా ఉంటే బాగుంటుంది. ఇక్కడ విశాలంగా ఉన్నప్పటికీ మాలాంటి వృద్ధులకు కష్టంగా ఉంది. మందుల కౌంటరు వద్ద వాసన వస్తున్నది.

- రంగస్వామి, శ్రీరంగాపురం, వెల్దుర్తి మండలం

నలుగురు సీఐలకు స్థానచలనం

కర్నూలు, జూన్ 17: కర్నూలు రేంజ్ పరిధిలో నలుగురు సీఐలను బదిలీ చేస్తూ సోమవారం డీఐజీ విజయరావు ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
జే. శివశంకర్	వీఆర్ కడప	మైదుకూరు రూరల్
ఎం. శ్రీనాథ్ రెడ్డి	మైదుకూరు రూరల్ సర్కిల్	వీఆర్, కడప
డి. రామాంజనేయుడు	వీఆర్, కర్నూలు రేంజ్	మైదుకూరు యుజీ
ఏపీ మస్తాన్	మైదుకూరు యుజీ పీఎస్	వీఆర్, కడప

టెలికాం నగర్‌లో చైన్ స్నాచింగ్

కర్నూలు, జూన్ 17: టెలికామ్ నగర్‌లో చైన్ స్నాచింగ్ జరిగింది. వరలక్ష్మి అనే మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరించుకుపోయారు. వరలక్ష్మి స్థానికంగా ఒక దుకాణం నిర్వహిస్తున్నది. బైక్‌పై వచ్చిన యువకుడు ముందుగా దుకాణంలోకి వచ్చి కురెకురె ప్యాకెట్లు కొనుక్కొని వెళ్లిపోయాడు. మరో పది నిమిషాల తర్వాత వచ్చి బైక్‌ను బయట నిలిపి స్వీట్ కావాలని అడిగాడు. ఆ వృద్ధురాలు మూత తీసి స్వీట్ల కోసం చేయి డబ్బాలో పెట్టగా మెడలోని గొలుసును లాక్కుని ఉడాయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

ముంతాజ్‌కు జాతీయ యోగా రత్న అవార్డు



కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 17: కర్నూలు జిల్లాకు చెందిన ప్రముఖ యోగా గురువు డా.ఎస్.ముంతాజ్‌భేగమ్‌కు జాతీయ యోగా టీచర్ అవార్డుతో పాటు యోగా రత్న అవార్డును హర్యానాకు చెందిన మానవియ్య నిర్మాణ్ మంచ్ ఇండియా ప్రకటించింది. జూన్ 21న 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ అవార్డును ముంతాజ్‌భేగం హర్యానాలో అందుకోనున్నారు. ముంతాజ్‌భేగంకు అవార్డు రావడం పట్ల జిల్లా యోగా సంఘం చైర్మన్ శ్రీధర్ రెడ్డి, అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీకాంతరెడ్డి, అవినాశ్ శెట్టితో పాటు క్రీడా సంఘాల ప్రతినిధులు యోగా సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

సీలంబం పోటీలు ప్రారంభం



సీలంబం క్రీడాకారులతో అతిథులు

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 17: ఒలంపిక్ డే సంబరాల్లో భాగంగా సోమవారం స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా సీలంబం అసోసియేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు పోటీలు నిర్వహించారు. జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడుతూ ఇలాంటి పోటీల వల్ల విద్యార్థులు క్రీడాకారులుగా ఎదిగి చక్కటి గుర్తింపు తెచ్చుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఒలంపిక్ సంఘం సభ్యులు టీ.గంగాధర్ సీలంబం అసోసియేషన్ కార్యదర్శి రాఘవేంద్ర పాల్గొన్నారు.

రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

●సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురుశేఖర్


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి గురుశేఖర్

కర్నూలు(న్యూసిటీ), జూన్ 17: ప్రభుత్వం రజకవృత్తిదారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి. గురుశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా అధ్యక్షుడు ముక్కన్న అధ్యక్షతన సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కూటమికి సంఘం తరపున శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో రజక కార్పొరేషన్‌కు నిధులు కేటాయించకుండ కాలయాపన చేసిందని ఆయన మండిపడ్డారు. తక్షణమే రజక కార్పొరేషన్‌కు రూ.1000 కోట్ల బడ్జెట్ కేటాయించి గతంలో ఫెడరేషన్ ద్వారా ఏర్పాటు చేసుకున్న రజక సొసైటీలకు రుణాలు అందజేయాలన్నారు. సమావేశంలో గౌరవ అధ్యక్షుడు సి.హనుమంతు, సి.జయమ్మ, కోశాధికారి సీహెచ్. శ్రీనివాసులు, సి.రాముడు, శేఖర్ బాబు పాల్గొన్నారు.

ప్రజాధనం దుర్వినియోగంపై విచారణ జరిపించాలి


కర్నూలు(న్యూసిటీ), జూన్ 17: ప్రజాధనం దుర్వినియోగంపై సీబీఐ దర్యాప్తు జరిపించి తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కే.బలరాం డిమాండ్ చేశారు. సోమవారం సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం విశాఖపట్నం రుషికొండపై రూ.500 కోట్ల ప్రజాధనంతో నిర్మించిన వాటిపై సీబీఐ దర్యాప్తు చేయాలన్నారు. రుషికొండపై నిర్మించి ఖర్చుతో రాయలసీమలో ఒక ప్రాజెక్టు పూర్తి చేయవచ్చని ఆయన అన్నారు. ఏపీలో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడమే కాకుండ బిల్లులో ప్రజాధనాన్ని స్వలాభం కోసం ఉపయోగించిన వారిపై సీబీఐ దర్యాప్తు చేయించి తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు డేవిడ్ పద్మానంద యోగి, శ్రీరాములు, గోవిందు, స్వాములు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావు ఎందరికో స్ఫూర్తి


రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 17: ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్, రామోజీరావు అంకితభావం అనేక మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచారనీ హైకోర్టు న్యాయవాది లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో జర్నలిస్టులు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మారుమూలకు గ్రామంలోని సమస్యల్నీ సైతం పత్రికల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేలా కృషి చేశారన్నారు. తెలుగు బాషా పరిరక్షణకు ఎంతో కృషి చేశారన్నారు. ఆయన జీవితాన్ని నేటి తరం స్ఫూర్తిగా తీసుకుని ఆదర్శాలను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

కేఎస్ భూషణ్‌రావు కన్నుమూత


నివాళులర్పిస్తున్న క్రీడాకారులు, క్రీడా సంఘాలు

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 17: అనారోగ్యంతో గత నెల రోజులుగా మృత్యువుతో పోరాడుతున్న బాస్కెట్‌బాల్ దిగ్గజం కేఎస్ భూషణ్‌రావు సోమవారం ఉదయం శ్రీకాకుళంలో కన్నుమూశారు. ఈయన గతంలో కర్నూలులో బాస్కెట్‌బాల్ క్రీడకు అద్భుత సేవలు అందించి అనేక మంది క్రీడాకారులకు చేయూతనందించారు. క్రీడా సంఘాలు, క్రీడాకారులు తదితరులు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఘనంగా బక్రీద్





కర్నూలు నగరంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు

కర్నూలు (కల్చరల్), జూన్ 17: జిల్లా వ్యాప్తంగా ఉన్న ముస్లింలు బక్రీద్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా ప్రాంతాల్లోని ఈద్గాలు, మసీదుల వద్ద మత పెద్దలు ఈద్ నమాజ్‌లు చేయించి, దైవ సందేశాన్ని అందించారు. బక్రీద్ వేడుక దైవం కోసం చేసిన త్యాగగుణాన్ని తెలియజేస్తుందని, అయితే ఈ త్యాగ గుణ జీవనాన్ని చిత్తశుద్ధిగా పాటించినప్పుడే దానికి సార్థకత చేకూరుతుందని చెప్పారు. కర్నూలు పట్టణంలోని మసీదులల్లో, దర్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కోడుమూరు (రూరల్): మండలంలోని అన్ని గ్రామాల్లో ముస్లింలు బక్రీదు పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఉదయానే స్నానమాచరించి నూతన దుస్తులు ధరించారు. చిన్నాపెద్ద కలిసి ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్యాలకుర్తి, చిల్లబండ, క్రిష్ణాపురం, గోరంట్ల, లద్దగిరి, పులకుర్తి తదితర గ్రామాల్లో పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి.

గూడూరు: బక్రీద్ పండుగ వేడుకలను ముస్లింలతో కలిసి పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు ఘనంగా జరుపుకోన్నారు. సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడుకు ముస్లింలు పూలమాలలతో సత్కరించారు.

సి. బెళగల్: మండల కేంద్రం, గొల్లలదొడ్డి, గుండ్రేవుల, కొత్తకోట బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, పోలకల్లు, కంబంధహల్, సంగాల, తిమ్మనదొడ్డి గ్రామాలలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని ముస్లింలు ఈద్గా దగ్గర కెల్లి ఖురాన్ పఠనం చేశారు.

ఓర్వకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం బక్రిద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఓర్వకల్లు, కన్నమడకల, పూడిచెర్ల, నన్నూరు, ఉయ్యాలవాడ, లొద్దిపల్లె, ఉప్పలపాడు, గుట్టపాడు, హుశేనాపురం, కాల్వ, కొమరోలు, శకునాల, తదితర గ్రామాల్లో ముస్లింలు ఈద్గాలలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రాజారెడ్డి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.


గూడూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడును సన్మానిస్తున్న ముస్లింలు



ఓర్వకల్లు, సి. బెళగల్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఎమ్మెల్యే గౌరు చరితకు అభినందల వెల్లువ

కల్లూరు, జూన్ 17: పాణ్యం ఎమ్మెల్యేగా గెలుపొందిన గౌరుచరితను ఆర్ఎస్ఎస్ నాయకులు అభినందించారు. సోమవారం స్థానిక మాదవీనగర్‌లోని తన స్వగృహంలో ఆర్ఎస్ఎస్ జిల్లా నాయకుడు సూరా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో గౌరుచరితను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎన్నికల్లో క్రియాశీలకంగా పనిచేసి ఇంతటి ఘనవిజయం సాధించడానికి కృషి చేసిన నాయకులు కార్యకర్తలకు గౌరుచరిత ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా నాయకులు కోదండరామ్, చంద్రశేఖర్, విశ్వనాథ్, మద్దిలేటి, నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● **మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని సన్మానించిన పార్వతమ్మ:** మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం బనగానపల్లెకు విచ్చేసిన బీసీ జనార్ధన్‌రెడ్డిని నంద్యాల జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు కే.పార్వతమ్మ ఘనంగా సన్మానించారు. సోమవారం బనగాలపల్లెలోని ఆయన నివాసంలో మంత్రికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు ఝాన్సీ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితమ్మను సోమవారం టీడీపీ యువ నాయకుడు మల్లెల ప్రశాంత్ ఆధ్వర్యంలో నాయకులు కలిశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గౌరు చరితమ్మ మాట్లాడుతూ హుశేనాపురం గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమిష్టి కృషితో ఎన్నికల్లో పని చేశారని మండలంలో అధిక మెజారిటీ హుశేనాపురంలో వచ్చిన సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులను, కార్యకర్తలను ఆమె అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు చిన్న, బజారు, మధు, ప్రసాద్, తేజ, అజర్, హరి, పూజారి శ్రీనివాసులు, వెంకటేశ్ నాయక్ తదితరులు ఉన్నారు


పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఆర్ఎస్ఎస్ జిల్లా నాయకులు


ఓర్వకల్లు: టీడీపీ యువ నాయకుడు మల్లెల ప్రశాంత్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితమ్మ


మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న నంద్యాల జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు కే.పార్వతమ్మ

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 17: విద్యారంగంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పాణ్యం నియోజకవర్గం ఎమ్మెల్యే గౌరు చరితమ్మను, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిలను డీటీఎఫ్ జిల్లా శాఖ కోరింది. నూతనంగా ఎన్నికైన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితమ్మను, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి డీటీఎఫ్ జిల్లా శాఖ అభినందనలు తెలియజేసింది. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, పత్రికా సంపాదకులు రత్నం ఏసేపు, బజారప్ప, సుబ్బరాయుడు, గోపాల్, రాఘవేంద్రరావు, సోమశేఖర్, హుశేనీ, మనోహర్ పాల్గొన్నారు.

మంత్రి బీసీని కలిసిన సోమిశెట్టి

కర్నూలు(అర్బన్), జూన్ 17: ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని బనగానపల్లెలోని ఆయన నివాసంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు ఇల్లూరి లక్ష్మయ్య, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమిశెట్టి నవీన్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమిశెట్టి వెంకటేశ్వర్లు బీసీ జనార్ధన్ రెడిద్దని శాలువతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయంలో రాష్ట్రంలోని రోడ్లు గుంతలు ఏర్పడి ప్రయాణం చేయలేని దుస్థితి ఏర్పడిందని, రోడ్లన్నీ మరమ్మతులు చేయాలని మంత్రిని కోరారు.


మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కలిసిన సోమిశెట్టి వెంకటేశ్వర్లు

'సకల శాస్త్రాలు భగవద్గీతలోనే ఉన్నాయి'


మాట్లాడుతున్న టీడీ రమణ

కర్నూలు(కల్చరల్), జూన్ 17: ప్రపంచంలోని సకల శాస్త్రాలన్నీ భగవద్గీత గ్రంథంలోనే ఉన్నాయని నగరంలోని విద్యాప్రకాశానందగిరి స్వామి గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డీవీ రమణ అన్నారు. సోమవారం ఏకాదశి పర్వదిన సందర్భంగా గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో, నగరంలోని సంకల్‌బాగ్‌లోగల గీతా ప్రచార ధామంలో 'సామూహిక సంపూర్ణ భగవద్గీత పారాయణం' కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పాల్గొని గీతా పారాయణం చేశారు. ఈ సందర్భంగా డీవీ రమణ మాట్లాడుతూ మానవ జీవిత పరమార్థం తెలుసుకోవాలంటే గీతా పఠనం, శ్రవణం ఒక్కటే మార్గదర్శకమని చెప్పారు. భగవద్గీత అమృత వాణి వంటిదని, అది సాటిలేని సంపదగా నిలుస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవితం పరిపూర్ణం చెందాలంటే భగవద్గీతను ఆశ్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ధార్మిక ప్రవచన కర్త కల్లే వేణుగోపాల్, తరిగొండ వేంగమాంబ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షురాలు పసుపులేటి నీలిమ, గీతా ప్రచార సంఘం కార్యదర్శులు సింహాద్రి రమేష్, ఎస్ రమేష్, ఇల్లూరి రమణ, మహాబలేష్, టీటీడీ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అపరకర్మల భవనం పూర్తి చేయాలి


కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును సత్కరిస్తున్న టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి నాయకులు

కర్నూలు(కల్చరల్), జూన్ 17: నగరంలోని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరై, ప్రస్తుతం అసంపూర్తిగా నిలిచిపోయిన బ్రాహ్మణ అపర కర్మల భవనం పూర్తి చేసి, తమకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుకు టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఎంపీ స్వగృహంలో కలిసిన బ్రాహ్మణ సంఘాల నాయకులు ఎంపీని ఘనంగా సత్కరించి, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంక్షేమ మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, బ్రాహ్మణ సాధికార సమితి నాయకులు టీవీ రవిచంద్రశర్మ, భానుప్రకాశ్, తిరుపతి, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి ఎంపోరియంలో థీమాటిక్ ఎగ్జిబిషన్ ప్రారంభం

కర్నూలు(కల్చరల్), జూన్ 17: నగరంలో పెద్దపోస్టాఫీసు ఎదురుగా ఉన్న లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎంపోరియంలో ఏపీ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో థామాటిక్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించినట్లు ఎంపోరియం మేనేజర్ బి. తిమ్మయ్య తెలిపారు. ఈనెల 21 వరకు కొనసాగే ఈ ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల హస్తకళా వస్తువులు, చేనేత వస్త్రాలను ప్రత్యేక తగ్గింపు ధరలతో విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు. హస్తకళాకారులు తాము ఉత్పత్తి చేసిన వస్తువులను నేరుగా విక్రయించుకునేలా హ్యాండీ క్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. ఈ ప్రదర్శనల్లో కొండపల్లి బొమ్మలు, ఏటి కొప్పాక బొమ్మలు, వైట్ మెటల్, రోజ్‌వుడ్ బొమ్మలు, వెల్‌వెట్ కార్పెట్స్, లెదర్ పప్పెట్రీలు, వైట్‌వుడ్ బర్డ్స్, లెదర్ లాంప్ షేడ్లు, బ్రాస్, కాపర్ వేర్, పేపర్ మెష్ ఐటమ్‌లు, దుర్గిస్టోన్ కార్వింగ్, టెర్రాకోట పాట్‌లు తదితర హస్తకళా ఉత్పత్తులు లభిస్తాయని తెలిపారు. అలాగే నారాయణ పేట, కలంకారీ, పోచంపల్లి, నారాయణవనం చీరెలు, డ్రెస్ మెటీరియల్ అందుబాటులో పెట్టామని తెలిపారు. చేనేత, హస్తకళా ఉత్పత్తులపై కళాభిరుచి గలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నివేదికలు సిద్ధం చేయండి

కేంద్ర కరువు బృందానికి నష్టం అర్థమయ్యేలా ఉండాలి

నంద్యాల జిల్లా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), జూన్ 17: కేంద్ర కరువు బృందం ఈ నెల 20 తేదీలలో జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం కరువు బృంద పరిశీలకుల పర్యటనపై జాయింట్ కలెక్టర్ టి. రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కరువు పరిస్థితులను తెలుసుకునే నిమిత్తం కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇంటర్‌మినిస్టీరియల్ టీం జిల్లాలోని ఉయ్యాలవాడ, దొర్నిపాడు, కోవెలకుంట్ల, మండలాల్లో పర్యటిస్తుందన్నారు. పంట నష్టం స్పష్టంగా అర్థమయ్యేలా నివేదికలు ఉండాలన్నారు. మండలానికి నాలుగైదు ఫోటోలతో పాటు నివేదికలు సిద్ధం కావాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. అలాగే పశుగ్రాస కొరతపై పశుసంవర్ధక శాఖ, ప్రకటించిన కరువు మండలాల్లో కూలీలకు కల్పించిన పనులపై డ్వామా, గ్రామాలలో నీటి రవాణాపై గ్రామీణ నీటి సరఫరా, నీటి లభ్యతను బట్టి రబీలో సాగుకు సరఫరా చేసిన సాగునీటి వివరాలను ఇరిగేషన్, భూగర్భ జల శాఖలకు సంబంధించిన అధికారులు నివేదికలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో పద్మజ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

మ్యాన్ హోల్స్‌పై కప్పుల ఏర్పాటు

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 17 : ఎమ్మిగనూరు పట్టణంలోని యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ)కింద ఏర్పాటు చేసిన మ్యాన్ హోల్స్‌పై సోమవారం పై కప్పులు వేశారు. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ పాడయిపోయాయి. మ్యాన్ హోల్స్ పై కప్పులు లేకపోవడంతో పాదాచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురయ్యేవారు. ఈ విషయాన్ని ఇటీవల "ప్రమాదకరంగా మ్యాన్ హోల్స్" అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఆయా ప్రాంతాల్లో మ్యాన్ హోల్స్ పై కప్పులు ఎక్కడ పాడయిపోయాయో గుర్తించి పై కప్పులు ఏర్పాటు చేశారు.

యాగశాల నిర్మాణానికి భూమి పూజ



యాగశాల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, జూన్ 17: మంత్రాలయంలో రూ.1.90 కోట్లతో యాగశాల నిర్మాణానికి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సోమవారం భూమి పూజ చేశారు. పూర్వపు పీఠాధిపతుల బృందావనం ముందు భాగాన తాత్కాలికంగా ఏర్పాటు చేసిన యాగశాల సమీపంలో రెండు అంతస్థులలో ఈ యాగశాల నిర్మాణాన్ని చేపట్టారు. బెంగుళూరుకు చెందిన నాగరాజు అనే భక్తుడు ఈ నిర్మాణానికి రూ.190 కోట్లు విరాళంగా అందజేశారు. నిర్మాణ నమూనాను పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తిలు దాత నాగరాజుకు వివరించారు. గ్రౌండు ఫ్లోర్‌లో యాగశాల, పల్లకీ సేవ నిర్వహించేందుకు విశాలమైన మండపం, దానిపైన మొదటి అంతస్థులో ప్రవచన మండపం భాగాలుగా విభజించి నిర్మాణం చేపట్టనున్నారు.

ప్రపంచ శాంతి కోసం హోమం : ప్రపంచంలోని ప్రజలు, భారతదేశంలోని రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ధన్వంతరీ హోమాన్ని నిర్వహించినట్లు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు తెలిపారు. సోమవారం శ్రీమఠం యాగశాలలో రిటైర్డు ప్రిన్సిపల్ వాదిరాజాచార్ ఆధ్వర్యంలో ధన్వంతరీ హోమాన్ని చేపట్టారు. పండితుల కనకాచలాచార్, వెంకటేశాచార్, కృష్ణాచార్ హోమాన్ని నిర్వహించారు

శ్రీమఠంకు రూ.3 లక్షలు విరాళం : రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన శ్రీధర్ అనే భక్తుడు విద్యదానంకు రూ.లక్ష, బెంగళూరుకు చెందిన ఇద్దరు అజ్ఞాత భక్తులు శ్రీమఠం అభివృద్ధికి రూ. లక్ష, మరో భక్తుడు శాశ్వత సేవకు రూ.లక్ష విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు.

రాఘవేంద్రుని సన్నిధిలో అనంతపురం జిల్లా జడ్జీ : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం అనంతపురం జిల్లా స్పెషల్ జడ్జి జస్టిస్ శివశంకర్ సతీసమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఈయనకు మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి లు ఘనంగా స్వాగతం పలికారు.

విద్యుదాఘాతంతో బాలునికి తీవ్రగాయాలు

మంత్రాలయం, జూన్ 17: మండలంలోని చౌలహల్లి గ్రామ సమీపంలో బోయ శ్రీనివాసులు, జయలక్ష్మి కుమారుడు బోయ వరుణ్ విద్యుత్ షాక్‌కు గురై సోమవారం తీవ్రగాయాలపాలయ్యాడు. వరుణ్ స్థానిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. బక్రీద్ సెలవు దినం కావడంతో పొలానికి వెళ్తుండగా.. 11 కేవీ విద్యుత్ స్తంభానికి ఆధారంగా కట్టిన తీగను పట్టుకోవడంతో షాక్ కొట్టింది. దీంతో వరుణ్ చేయి ఛిద్రమైంది. గమనించిన పొలాల్లోని రైతులు హుటాహుటిన తల్లిదండ్రులకు సమాచారం అందించి ఆదోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ప్రమాదానికి కారణం కరెంటు తీగలా లేదా డిష్ వైరునా అనే విషయం తేలాల్సి ఉంది. గ్రామస్థులు మాత్రం విద్యుత్ వైరు దిగువ తంతి మీద తాకడంతోనే బాలునికి ప్రమాదం జరిగిందని పేర్కొంటున్నారు. ట్రాన్స్‌కో ఏఈ మాత్రం డిష్ వైరు వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని తెలిపారు. మంగళవారం సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేస్తామని ఏఈ గోవిందు తెలిపారు.

పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలి

● ఎంపీకి విన్నవించిన సర్పంచులు

తుగ్గలి, జూన్ 17: టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును గిరిగిట్ల పంచాయతీ గౌరవ సలహాదారుడు మధుబాబు, మాజీ సర్పంచు లింగమయ్య కోరారు. సోమవారం కర్నూలులో ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసి పూలమాలలు, శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ నిధులు మంజూరు చేయాలని కోరారు. వైసీపీ పాలనలో పంచాయితీలకు నిధులు రాక గ్రామంలో పారిశుధ్య పనులను కూడా సొంత ఖర్చులతో అప్పులు చేసి చేయించామని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేక తలెత్తుకు తిరగలేకపోయామని, నిధులు మంజూరు చేస్తే అభివృద్ధి పనులు చేస్తామని పేర్కొన్నారు. ఎంపీని కలిసిన వారిలో టీడీపీ నాయకులు లోకేశ్ తదితరులు ఉన్నారు.

దళితవాడలో రహదారులు నిర్మించాలి



సంతనాగలాపురంలోని దళితవాడలో రహదారి దుస్థితిని చూపుతున్న నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, జూన్17: ఎస్ నాగలాపురం దళితవాడలో రహదారులు నిర్మించాలని ఏఐకేఎస్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు సత్యన్న, బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఎస్ నాగలాపురం గ్రామంలోని దళితవాడలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని దళితవాడలో ప్రజలకు మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పుడుతున్నారన్నారు. ప్రధానంగా రోడ్లు డ్రైనేజీలు లేక వర్షం వచ్చినప్పుడు రోడ్లపై వర్షపు నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారిందని పేర్కొన్నారు. దళితవాడ మొత్తం బురదగుంటను తలపిస్తోందన్నారు. తాగునీరు సైతం సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. గతప్రభుత్వం అభివృద్ధిని మరచి పాలన సాగించిందని, కనీసం కొత్త ప్రభుత్వమైనా గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. వెంటనే దళితవాడలో రహదారులు నిర్మిచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, బాబు, దానమయ్య, చార్లెస్, ఏసేపు, దస్తగిరి, జయరాం పాల్గొన్నారు.

అభివృద్ధే టీడీపీ ధ్యేయం

● జడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు

తుగ్గలి, జూన్ 17: రాష్ట్ర అభివృద్ధి తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యమని మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు అన్నారు. సోమవారం ఆయన ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ఐక్యంగా రాక్షస పాలనకు అంతం పలికారని అన్నారు. ప్రజలందరూ మూకుమ్మడిగా ఓట్లు వేసి టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించారని పేర్కొన్నారు. వైసీపీకి ప్రతిపక్ష హోదా లేకుండా క్లీన్ స్వీప్ చేశామని, ఎన్డీయే కూటమితో ఇంత భారీ విజయాన్ని కట్టబెట్టిన రాష్ట్ర ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



కౌతాళంలో.. ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మంత్రాలయంలో..



ఆలూరులో..



తుగ్గలిలో..

త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగను ముస్లింలు జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా జరుపుకున్నారు. హజ్రత్ ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్వార్థం, అసూయ, రాగద్వేషాలను విడిచిపెట్టి మానవులలో త్యాగనిరతిని వ్యాపింప చేయడమే బక్రీద్ పండుగ సారాంశమని మత పెద్దలు తెలిపారు. అన్ని గుణాలలో దాణగుణమే ఉత్తమమైనదని హజ్రత్ ఇబ్రహీం నిరూపించారని, సకల మానవాళికి హజ్రత్ ఇబ్రహీం దానగుణం అనుసరనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పేదలకు దానధర్మాలు చేశారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



గోనెగండ్లలో..



హొళగుందలో నమాజ్‌కు వెళ్తున్న ముస్లింలు



ఆదోనిలో..



నందవరంలో శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు



ఆదోనిలో..



ఎమ్మిగనూరులో..

కలుషిత నీరు ప్రాణం తీసింది

● వాంతులు, విరేచనాలతో వృద్ధురాలి మృతి
● అదే లక్షణాలతో మరికొందరు ఆసుపత్రిపాలు
● స్పందించని అధికారులు

హొళగుంద, జూన్ 17: హొళగుంద మండలం నేరణికి తండాలో కలుషిత నీరు తాగి సోమవారం ఓ వృద్ధురాలు మృత్యువాతపడింది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. చంద్రి భాయి (60)అనే వృద్ధురాలు కలుషిత నీరు తాగడంతో వాంతులు, విరేచనాలతో మూడురోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండేది. ఆలూరు ప్రభుత్వం ఆసుపత్రిలో చికిత్స తీసుకొని ఇంటికి వచ్చారు. మళ్లీ వాంతులు, విరేచనాలు అధికం కావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కుళాయిలకు సరఫరా అయ్యే నీరు కలుషితం కావడం వల్లే మృతి చెందిందని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజులుగా గ్రామానికి చెందిన శాంతా బాయి, పావని బాయి, లక్ష్మిబాయితో పాటు ఓ ఐదేళ్ల బాలుడు హొళగుంద ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు తెలిపారు. అలాగే వీరితోపాటు సుమారు పది మందికి పైగా వాంతులు, విరేచనాలతో ఆలూరు ప్రభుత్వ అసుపత్రిల్లో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. నీరు కలుషితం కావడం వల్లే వాంతులు, విరేచనాలతో ఆసుపత్రులపాలు అయ్యారని భయాందోళన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి వైద్యశిబిరం ఏర్పాటు చేసి, ఇంటింటి సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఆదోని డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ సత్యవతిని వివరణ కోరగా ఆసుపత్రిలో ఓపీల ద్వారా వైద్యం చేస్తున్నామని, అలాగే గ్రామంలో ఏఎన్ఎమ్ ద్వారా మందులు అందిస్తున్నామని తెలిపారు. పారిశుధ్యం పనులు చేయాలని ఎంపీడీవోకు, పంచాయతీ అధికారులను కోరామని పేర్కొన్నారు.

మాజీ పంచాయతీ సభ్యుడు మృతి

మద్దికెర, జూన్ 17: స్థానిక చాకలి వీధిలో నివసించే మాజీ పంచాయతీ సభ్యుడు చాకలి నగేష్ (46) సోమవారం మృతి చెందాడు. చాకలి నాగేష్ వారం రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ మల్లికార్జున యాదవ్, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, మాజీ జడ్పీటీసీ రాజన్న యాదవ్, మాజీ ఎంపీటీసీ బీ శ్రీనివాసులు యాదవ్, మైనార్టీ నాయకులు ఆకుల ఖాజావలి మృతుని భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మంచి మనిషిని కోల్పోయామని, బాధిత కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియాజేశారు.

రేపు కరువు బృందం రాక

మద్దికెర : ఈ నెల 19వ తేదీన కేంద్ర కరువు బృందం మండలంలో పర్యటిస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారి ఉప్పర రవి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 19వ తేదీ కేంద్ర కరువు బృందం మండలలోని కంది పంటను పరిశీలిస్తారని పేర్కొన్నారు. రైతులందరూ అందుబాటులో ఉండాలని సూచించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

పత్తికొండ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలి

● ఆర్థిక శాఖ మంత్రి కేశవ్‌కు తుగ్గలినాగేంద్ర వినతి



మంత్రికి అభినందనలు తెలుపుతున్న నాగేంద్ర

తుగ్గలి, జూన్ 17: పశ్చిమ ప్రాంతమైన పత్తికొండ వెనుకబడిన ప్రాంతమని, ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవులను కోరినట్లు తుగ్గలి నాగేంద్ర తెలిపారు. సోమవారం అనంతపురం జిల్లా గుత్తిలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవులను కలిసి శాలువ కప్పి అభినందనలు తెలిపారు. అలాగే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపడంతో పాటు వెనుకబడిన ప్రాంతమైన పత్తికొండ ప్రాంతానికి నిధులు మంజూరు చేయాలని కోరామని పేర్కొన్నారు. అలాగే గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను కలిసి సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తిమ్మయ్య చౌదరి ఉన్నారు.

సంక్షిప్తం

ముస్లిం ప్రాంతాల్లో కమిషనర్ పర్యటన

ఆదోని టౌన్, జూన్ 17: బక్రీద్ పండుగ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి సోమవారం సిబ్బందితో కలిసి పట్టణంలోని మైనారిటీ ప్రాంతాల్లో పర్యటించారు. అన్ని మసీదు పరిసరాలను, పెద్ద కమేలా ప్రాంతాల్లో తాగు నీటి సరఫరాతో పాటు, ప్రార్థనా మందిరాల పరిసరాలలో పారిశుధ్య పనులను పరిశీలించారు.

చంద్రబాబు పాలనలో మంచి వర్షాలు

హాలహర్వి, జూన్ 17: ఈ సారి చంద్రబాబు పాలనలో మంచి వర్షాలు కురుస్తున్నాయని, అన్నదాతల్లో ఆనందం చూస్తున్నామని టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు వస్తే కరువు వస్తుందనే ప్రతిపక్షాల వాదనను వరుణుడు సైతం కొట్టేసి.. వైసీపీ దుర్భర పాలనను వాగుల్లో కలిపేస్తున్నాడని పేర్కొన్నారు. ఇప్పటికైన వైసీపీ నేతుల బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు.

కేవీపీఎస్ సమావేశాలను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు, జూన్17: ఈనెల 22, 29, జూలై 6న జిల్లా వ్యాప్తంగా జరిగే కేవీపీఎస్ జనరల్ బాడీ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు దేవసహాయం, ఎండీ ఆనంద్ బాబులు పిలుపు నిచ్చారు. సోమవారం పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో నాయకులు రాజు అధ్యక్షతన జరిగిన జిల్లా బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దళితుల సమస్యలపై స్పందించి పనిచేసే సంఘంగా సంఘాన్ని మరింత బలోపేతం చేసుకొని ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రాజకీయాలు మారిన నేపథ్యంలో గ్రామాల వారిగా మనం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి కొత్త ప్రభుత్వం ముందు ఉంచాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, పట్టణ జనరల్ బాడీ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 22న ఎమ్మిగనూరు, 29న నందవరం, జూలై 6న ఎమ్మిగనూరు పట్టణ జనరల్ బాడీ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల్లో సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు ఆంథోని, సమాల రాజు, గుంటెప్ప, నాగప్ప, గంగన్న, చిన్నప్ప, తిమ్మన్న, రాజా రమేష్, ఆనంద్, దేవపుత్ర పాల్గొన్నారు.

రాజేంద్రగౌడ్‌కు గజ్జెహళ్లి గ్రామస్తుల సన్మానం

హొళగుంద, జూన్ 17: టీడీపీ యువనాయకుడు ఈడిగ రాజేంద్రగౌడ్‌ను గజ్జెహళ్లి గ్రామస్థులు సన్మానించారు. సోమవారం స్థానిక సిద్ధేశ్వర రైస్ మిల్లులో గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆయనను సన్మానించి టీడీపీ విజయంతో కార్యకర్తల్లో నూతనోత్సాహం రెట్టింపు అయ్యిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఆలాం, రామలింగ, హుసేన్, పేక్షా వలి, హరుణ్ బాషా, పొంపా పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

ఆదోని రూరల్, జూన్ 17 : వాహన చోదకులు రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాల్సిన అవసరం ఉందని రూరల్ సీఐ నీరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం వాహనాల తనిఖీల్లోభాగంగా సీఐ డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వేగ నియంత్రణ పాటించి ప్రయాణీకులను సురక్షితంగా గమ్యాలకు చేర్చాలన్నారు. వేగంగా వెళ్లడం వలన ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోవడంతోపాటు కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని సీఐ సూచించారు.

మార్కెట్ కమిటిలో క్లీనింగ్ టెండర్ వాయిదా

ఎమ్మిగనూరు, జూన్17: ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఈ నెల 20న జరగాల్సిన క్లీనింగ్ టెండర్‌ను అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు మార్కెట్ కమిటి పర్సన్ ఇన్‌చార్జీ, కార్యదర్శి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని అందరూ గమనించాలని కోరారు. తిరిగి టెండర్ ఎప్పుడు వేసేది త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

టీడీపీ నాయకుడికి సన్మానం

నందవరం, జూన్ 17: టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ దేశాయి మాధవరావును సోమవారం టీడీపీ కార్యకర్తలు సన్మానించారు. మండల కేంద్రంలో టీడీపీకి 1455 మెజార్టీ రావడాని దేశాయి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఎస్సీ కాలనీ నాయకులు, యువత, గ్రామంలో సామాజిక వర్గం వారు వచ్చి సన్మానించారు. ఆయనకు ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు చైర్మన్ పదవి మళ్లి ఇవ్వాలని నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు.

దళిత బాంధవుడు చంద్రబాబు

ఎమ్మిగనూరు, జూన్17: ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు తన మంతివర్గంలో వంగలపూడి అనితను హోంశాఖ మంత్రిగా నియమించి మాదిగ సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పించి దళిత బాంధవుడుగా మారారని టీడీపీ నాయకులు కదిరికోట ఆదెన్న అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలోనే దళితుల అభివృద్ధి జరిగిందన్నారు. రాజ్యాంగబద్ధంగా దళితులకు పదవులు కట్టబెట్టడంలో చంద్రబాబు పునాదులు వేశారని పేర్కొన్నారు. లోక్‌సభ స్పీకర్‌గా గతంలో దళితుడైన జీఎంసీ బాలయోగిని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా దళిత మహిళ ప్రతిభాభారతిని నియమించడమేకాకుండా దేశతొలి రాష్ట్రపతిగా కేఆర్ నారాయణ్‌ను ప్రతిపాదించింది చంద్రబాబుయే నని గుర్తు చేశారు. అలాగే దళిత ఐఏఎస్ అధికారి కాకిమాదవరావును ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించిన చంద్రబాబు ఎస్సీ, ఎస్టీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించారని, అంటరానితనం నిర్మూలన కోసం 2001లో జస్టిస్ పున్నయ్య కమిషన్‌ను నియమించి ఆ కమిటీ చేసిన 42 సిఫారస్సుల అమలు కోసం 18జీవోలు విడుదల చేసి రాష్ట్ర రాజకీయ చరిత్రలో దళితబాంధవుడిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. చంద్రబాబుకు మాదిగలు రుణపడి ఉంటారని తెలిపారు. సమావేశంలో నాయకులు రోజా ఆర్ఫ్ ఉసేని పాల్గొన్నారు.

3వ వార్డులో బోరు ఏర్పాటు

ఎమ్మిగనూరు, జూన్17: ఎమ్మిగనూరు పట్టణంలోని 3వ వార్డులో నీటి సమస్యను పరిష్కరించేందుకు గాను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం మున్సిపల్ అధికారులు కొత్తగా బోరును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బోరుకు స్థానిక కాలనీవాసులు, టీడీపీ నాయకులు చేనేత మల్లికార్జున పూజలు చేశారు. అనంతరం బోరు వేసి నీటి సమస్యకు చెక్‌పెట్టారు. వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

బీవీని కలిసిన ఉద్యోగ సంఘాల నాయకులు

ఎమ్మిగనూరు, జూన్17: ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పాటు వివిధ కుల సంఘాలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీఎన్జీవో తాలుకా అధ్యక్షకార్యదర్శులు మద్దిలేటి, వరప్రసాద్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు శివరామ్‌రెడ్డి, సురేష్, ప్రభు, రామకృష్ణ, 4వ తరగతి ఉద్యోగ సంఘం నాయకులు మల్లికార్జున, లోకేష్, చిన్నరాముడు తదితరులు ఎమ్మెల్యేను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వీఆర్ఏలు, వాల్మీకి వనభోజన సమితి నాయకులు రామకృష్ణ, పుండుకూరు రంగన్న తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిక

ఆదోని, జూన్ 17: స్థానిక ఇందిరానగర్ మాజీ కౌన్సిలర్ నాగరాజు, కేడీసీఎమ్ఎస్ మేస్త్రీ కృష్ణతో పాటు మరో 50 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి టీడీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, త్వరలో నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏమి చేయాలో చేస్తామని మీనాక్షినాయుడు భరోసా ఇచ్చారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● నారా లోకేశ్‌కు విన్నవించిన ఏఐటీయూసీ నాయకులు

ఆలూరు, జూన్ 17: రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, పార్ట్ టైం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర మానవ వనరుల, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఏఐటీయూసీ నాయకులు కోరారు. సోమవారం ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో కలిసి సమస్యలు విన్నవించినట్లు రాష్ట్ర కార్యదర్శి రమేష్ బాబు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో న్యాయం చేస్తానని జగన్ హామీ ఇచ్చి ఆప్కాస్‌ను ఏర్పాటు చేసినా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒరిగిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మోడల్ హాస్టల్స్‌లో వార్డెన్లు 24 గంటలు విధులు నిర్వహిస్తున్నా, వేతనం మాత్రం రూ.17వేలకు మించి ఇవ్వడం లేదన్నారు. న్యాయం చేయాలని లోకేశ్‌ను కోరినట్లు తెలిపారు.

చంద్రబాబు పాలనలో రాష్ట్రాభివృద్ధి

ఆలూరు, జూన్ 17: చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభీక్షంగా అభివృద్ధి పథంలో నడుస్తుందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. సోమవారం బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఆయనను సన్మానించారు. ముస్లిం వర్గాలకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రాధాన్యత కల్పించేందుకు మైనారిటీ శాఖ మంత్రిగా ఎన్ఎండీ ఫరూక్‌కు అవకాశం కల్పించారని గుర్తుచేశారు. ముస్లిం మైనారిటీల సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఆయన పండుగ శుభాకాంక్షలు తెలిపారు.